JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 02-03-2026
Medchal - Malkajgiri । Monday 02-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 275
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 275 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com




# భారత్ సమస్యలు పెరగనున్నాయా?

- చమురు ధరలు పెరిగే అవకాశం
- భారత్ ఇమేజ్‌పై ఎలాంటి ప్రభావం ఉంటుంది?
- భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు జరిగాయి

**జయభేరి, న్యూఢిల్లీ:**

ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఆయనతో పాటు రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్, ఐఆర్‌జీసీ చీఫ్ కూడా మరణించినట్లు ఆదివారం ధ్రువీకరించారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో, రెండు ప్రభుత్వాల మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య 17 ఒప్పందాలు కుదిరాయి. పది ప్రకటనలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్‌కు భారత్ అచంచలమైన మద్దతు కూడా ఈ పర్యటన ద్వారా స్పష్టమైంది. ఇజ్రాయెల్ పార్లమెంట్ నెసెట్‌లో చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ ''భారత్ ఇజ్రాయెల్‌కు బలంగా, పూర్తి విశ్వాసంతో అండగా నిలుస్తుంది. ఇప్పుడు,

...మిగతాది 2 లో

తెలంగాణకు చెందిన 2 వేల మంది విద్యార్థులు ఇరాన్‌లో యుద్ధ భయాల మధ్య బిక్కుబిక్కుమంటూ బతుకుతుండటం.. ఇక్కడ ఉన్న వారి తల్లిదండ్రులను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది. మిసైళ్లు, బాంబుల వర్షం కురుస్తుండటంతో ఇరాన్‌లో తమ వారు ఎలా ఉన్నారోననే ఆందోళన వారిలో తీవ్రమవుతోంది. ఈ క్రమంలోనే స్పందించిన తెలంగాణ సీఎం.. తెలుగు వారంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

# గల్ఫ్ దేశాల్లో తెలుగువాళ్లు



- ఇరాన్‌లో చిక్కుకున్న 2000 మంది తెలంగాణ విద్యార్థులు
- హైదరాబాద్ నగరం నుంచే 900 మంది ఆ దేశంలో ఉన్నత చదువుల కోసం వెళ్లారు
- సీఎం రేవంత్ కీలక సూచనలు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 1 :**

ప్రస్తుతం ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఆ దేశంలో భారతీయులు కూడా చాలా మంది ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక్క తెలంగాణ నుంచే ఇరాన్‌లోని పలు నగరాల్లో 2 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో ఒక్క హైదరాబాద్ నగరం నుంచే 900 మంది ఆ దేశంలో ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేస్తుండగా.. ఇరాన్ కూడా ప్రతి దాడులు చేస్తోంది. మరోవైపు.. ఇంటర్నేషనల్ విమానాలు భారీగా రద్దు కావడంతో ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు.. తిరిగి స్వదేశాలకు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ పిల్లల కోసం ఇక్కడ వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ఇప్పుడు తెలంగాణ, మరీ ముఖ్యంగా హైదరాబాద్ వాసులను తీవ్రంగా భయపెడుతోంది. హైదరాబాద్‌కు చెందిన 900 మంది విద్యార్థులు ఇరాన్‌లోని టెహ్రాన్, కుం వంటి నగరాల్లో చదువుకుంటున్నారు.

...మిగతాది 2 లో




# ఏపీలో మహిళా దినోత్సవ కానుక

- ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఈ మూడు పథకాలను అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు
- పిల్లల చదువుల కోసం ₹1 లక్ష వరకు పావలా వడ్డీకే రుణం ఇచ్చే ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం
- కుమార్తె పెళ్లికి 48 గంటల్లోనే ఆర్థిక సాయం అందించే ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకం
- యానిమేటర్లకు ₹15,000 విలువైన స్మార్ట్‌ఫోన్లు ఉచితం

**జయభేరి, విజయవాడ, మార్చి 1 :**

ఏపీలో మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన మూడు కీలక పథకాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఈ మూడు పథకాలను అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో రెండు పథకాలకు ఎన్టీఆర్ పేరే పెట్టారు. మరో పథకం నేరుగా అమలు చేయబోతున్నారు. దీని వివరాలను ప్రభుత్వం త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. మార్చి 8న అంతర్జాతీయ 'మహిళా దినోత్సవం' సందర్భంగా ఏపీ ప్రభుత్వం మూడు కొత్త పథకాలు ప్రకటించేందుకు సిద్ధమైంది. ఇందులో పిల్లల చదువుల కోసం ₹1 లక్ష వరకు పావలా వడ్డీకే రుణం ఇచ్చే ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం, అలాగే కుమార్తె పెళ్లికి 48 గంటల్లోనే ఆర్థిక సాయం అందించే ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకంతో పాటు యానిమేటర్లకు ₹15,000 విలువైన స్మార్ట్‌ఫోన్లు ఉచితంగా ఇచ్చే మరో పథకాన్ని కూడా ప్రారంభించబోతున్నారు. ఇప్పటికే మహిళల కోసం సూపర్ సిక్స్

...మిగతాది 2 లో

# ఈ పాపం మీది కాదా..!?



2 లో

# ఈనెల 3న యాదగిరిగుట్ట ఆలయం మూసివేత



3 లో




# ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- లైసెన్స్ లేకుండా దొరికితే బండి సీజ్
- ట్రాఫిక్ పోలీసుల హెచ్చరికలు

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారే టార్గెట్‌గా తనిఖీలు చేపట్టనున్నారు. ఒకవేళ లైసెన్స్ లేకుండా దొరికితే

...మిగతాది 2 లో



# చేవెళ్లలో ఘోర అగ్ని ప్రమాదం

- హీరో హోండా గోదాంలో మంటలు
- రూ.2 కోట్ల మేర నష్టం

**జయభేరి, చేవెళ్ల :**

చేవెళ్ల పరిధిలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శంకర్‌పల్లి రోడ్డులోని ఓ హీరో హోండాకు సంబంధించిన ఆటో మొబైల్స్ గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇవాళ ఉదయం భారీ అగ్నిప్రమాదం జరగ్గా.. క్షణాల్లోనే మంటలు గోదాం మొత్తం వ్యాపించాయి. దీంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఫైర్ సేఫ్టీ పోలీసులుకు

...మిగతాది 2 లో



# ఈ సారి చుక్కలే.. మండిపోనున్న మార్చి..

**జయభేరి, హైదరాబాద్, మార్చి 1 :**

దేశంలో వేసవి ఎండలు ఈసారి ముందే మొదలుకానున్నాయి. మార్చి నుండి మే నెల మధ్య దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, తీవ్రమైన వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వడగాలుల ప్రభావం ముఖ్యంగా పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తర కర్ణాటక,

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## గల్ఫ్ దేశాల్లో తెలుగువాళ్లు

ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారం రోజున జరిపిన ఆకస్మిక దాడితో అక్కడ ఉన్న తెలుగు వారు తీవ్ర భయపడుతున్నారు. హైదరాబాద్‌లోని పాతబస్తీ, టోలీచౌకి ప్రాంతాల్లోని విద్యార్థులను తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మరోవైపు.. తెలంగాణకు చెందిన 2000 మంది ఇరాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఇంజనీర్లతోపాటు బిజినెస్‌మెన్‌లు తరచూ హైదరాబాద్ నుంచి ఇరాన్‌కు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇక ఇరాన్‌లో ఉన్న హైదరాబాదీలకు సంబంధించిన సమాచారం తెలియకపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇరాన్‌లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని అక్కడి ప్రభుత్వం ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేయడంతో.. తమ వారి ఫోన్లు కూడా కలవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. దాడుల నేపథ్యంలో అక్కడి అధికారులు సూచించే భద్రతా మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఆ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే తప్ప బయటకు రావద్దని హితవు పలికారు. ఇరాన్‌లో చిక్కుకున్న తెలుగువారిని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో తాము సమన్వయం చేసుకుంటామని వివరించారు. పరిస్థితిని తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

బండి సీజ్ చేయటంతో పాటు ఫైన్ కూడా విధించనున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్ విధిగా దగ్గర ఉంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ వాహనదారులకు అలర్ట్. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మీ వెహికల్ బయటకు తీశారా.. ఇక అంతే సంగతులు. మీ బైక్ లేదా కార్ సీజ్ కావటం ఖాయం.

ఎందుకంటే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్స్ లేకుండా వెహికల్స్ నడిపే వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధమైంది. నేటి (మార్చి 1) నుంచి నగర పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వెహికల్ నడిపితే వారి వాహనం సీజ్ చేయనున్నారు. అనంతరం వారికి స్పెషల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. డ్రైవింగ్ లైసెన్స్, ఎల్ఎల్ఆర్ తీసుకునేందుకు తగినంత సమయం కూడా ఇస్తారు. తర్వాత కోర్టులో ఫైన్ చెల్లించి వాహనం తీసుకెళ్లవచ్చు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చే యజమానులపైనా కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ జాయింట్ సీపీ హెచ్చరించారు. వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర పెట్టుకోవాలని సూచించారు. లేదంటే వాహనాలు సీజ్, ఫైన్ వంటివి ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇస్తున్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణలో కొత్తగా వాహనాలు కొనుగోలు చేసే వారికి నేటి నుంచి (మార్చి 1) అదనపు భారం పడనుంది. రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, రహదారి భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం 'రోడ్డు సేఫ్టీ సెస్' పేరుతో కొత్త పన్నును అమల్లోకి తీసుకువచ్చింది.

ఈ మేరకు రవాణా శాఖ ఇప్పటికే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలు కొత్తగా కొనుగోలు చేస్తే రూ. 2 వేలు అదనంగా చెల్లించాలి. ఫోర్ వీలర్లు రూ. 5వేలు, భారీవాహనాలు, ప్రైవేట్ వాహనాలకు రూ. 10 వేల వరకు పన్ను పడుతుంది. ఈ సెస్‌ను వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనే వన్‌టైమ్ పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రభుత్వానికి ఏటా సుమారు రూ. 300 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను కేవలం రోడ్డు భద్రత కోసమే వినియోగించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయి. దీని ద్వారా ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్లను సరిచేయడం, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడం, అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచడం వంటి పనులు చేపట్టనున్నారు.

## చేవెళ్లలో ఘోర అగ్ని ప్రమాదం

సమాచారం అందించి ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పేశారు. ఈ సంఘటన తెల్లవారుజామున జరగటంతో అక్కడ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కరెంట్ షార్ట్ సరుక్యూట్ కారణంగా గోదాంలో మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిసింది.

రంగారెడ్డి జిల్లాల్లో ఉన్న అన్నీ ఆటో మొబైల్స్ దుకాణాలకు ఇక్కడి నుంచే వస్తువులను సప్లై చేస్తుంటారు. అయితే ఈ ఘటనపై స్థానికులకు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో గిట్టని వారు నిప్పు పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆస్తి నష్టం, ఘటన ఎలా జరిగి ఉండొచ్చుననే విషయాలపై ఆరా తీస్తున్నారు. కాగా, ఇటీవల కాలంలో తెలంగాణలో అగ్ని ప్రమాదాలు ఎక్కువయ్యాయి. రెండ్రోజుల క్రితం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మంగళగౌరి బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో షోరూం మొత్తం అగ్నికి ఆహుతైంది.

ఆ సమయంలో షోరూంలో ఎవరూ లేకపోటవంతో పెను ప్రమాదం తప్పింది. జనవరి చివరి వారంలో నాంపల్లి బచ్చాస్ ఫర్నీచర్ దుకాణంలోనూ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ఫిబ్రవరి మొదటి వారంలో నాంపల్లి ఎఫ్ఎస్ఎల్ కార్యాలయంలోనూ ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. ఈ ఘటనలో పోలీసు శాఖకు చెందిన కీలక ఫైల్స్, కేసులకు సబంధించిన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రస్తుతం ఎండాకాలం సమీపిస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని ఫైర్ సెఫ్టీ అధికారులు సూచిస్తున్నారు. దుకాణాలు, గోదాంల యజమానులు ఫైర్ సెఫ్టీ నిబంధనలు పక్కాగా పాటించాలని చెబుతున్నారు. లేదంటే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## ఏపీలో మహిళా దినోత్సవ కానుక

హామీల్లో భాగంగా ఉన్న స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నారు. అలాగే డ్వాక్రా మహిళలకు సాయాన్నీ అందిస్తున్నారు. వీటికి తోడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాల్సి ఉంది. దీనికి ముందే ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మహిళలకు ఈ పథకాలు కూడా అమల్లోకి వస్తే నెలకు 1500 ఇచ్చే ఆడబిడ్డ నిధి పథకం ఒక్కటే మిగిలి ఉంటుంది.

## ఈ సారి చుక్కలే..

ఉత్తర తమిళనాడు ప్రాంతాలలో ఎక్కువగా ఉండనుంది. వడగాలుల వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం ఉందని IMD DG మృత్యుంజయ్ మోహపాత్ర ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే నీటి ఎద్దడి, విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. మార్చిలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణంగా ఉండే అవకాశం ఉంది. అయినప్పటికీ ఈశాన్య, వాయువ్య, తూర్పు మధ్య దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం భూమధ్యరేఖ పసిఫిక్‌లో బలహీనమైన లా నినా పరిస్థితులు ఉన్నాయి. అయితే రాబోయే నెలల్లో తటస్థ ఎల్ నినో పరిస్థితులు తిరిగి రావచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

**ఫిబ్రవరి నెల రికార్డులు**

గత నెల వర్షపాతం 2001 తర్వాత అత్యల్పంగా నమోదైంది. అలాగే 1901 నుండి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ఫిబ్రవరి నెలల్లో ఇది ఒకటిగా నిలిచింది. పాశ్చాత్య అవాంతరాలు చురుకుగా లేకపోవడం వల్లే ఈసారి ఫిబ్రవరిలో వర్షాలు, చలి గాలులు తగ్గాయని IMD వివరించింది.

# ఈ పాపం మీది కాదా..!?

- వర్గీకరణ ఒక బూటకం..
- ఎస్సీలను విడగొట్టిన పాపం..






కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

**జయభేరి, హైదరాబాద్ :**

మాల కులస్తులకు ధ్రువీకరణ పత్రం దొరకక నానా ఇబ్బందులు... దీనికి కారణం ఎవరు? ఎవరిని నిందించాలి ఏమని ప్రశ్నించాలి.. పద్మశ్రీగా దక్కిన గౌరవం.. వర్గీకరణ చేసిన తర్వాత ఎవ్వరి చేతులు వాళ్ళు దులుపుకున్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ఏండ్లకు ఏండ్లు ఉద్యమం చేసిన మంద కృష్ణ మాదిగ తాను అనుకున్న కుటిల రాజకీయ దుర్బుద్ధికి నిదర్శనంగా మారాడు. ఎందుకు ఈ మాట చెబుతున్నాను అంటే.. ఎస్సీ వర్గీకరణ తర్వాత మాల కుల వర్గీయులు ఎక్కువమంది ఉండి మా సొమ్ము దోచుకుంటున్నారు మా అన్నం కంచం గుంజుకుంటున్నారు అని గగ్గోలు పెట్టిన మందకృష్ణ మాటలన్నీ ఇప్పుడు అబద్ధాలు అని తేటతెల్లమవుతున్నాయి. ఎందుకంటే వర్గీకరణ తర్వాత మాల సామాజిక వర్గాల్లో 2000 సంవత్సరం వరకు ఎస్సీ మాల అని కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నప్పటికీ తాజాగా ఇప్పుడు ఉపకులం ఏంటని అడిగితే మాల సామాజిక వర్గం మన్నే ఉప కులం వాళ్ళు కొంతమంది ఉంటే పంబాల ఉపకులం వాళ్లు వేల సంఖ్యలోనే ఉన్నారు. కానీ వర్గీకరణకు కారణమైన మందకృష్ణ మాదిగ చెప్పిన మాటలు మాలలు లక్షల్లో ఉన్నారు మా రిజర్వేషన్లు దొడ్డి తింటున్నారు అని చెప్పిన మాట పచ్చి అబద్ధం... వర్గీకరణ పేరుతో మాల మాదిగలను విడగొట్టి పద్మశ్రీగా అవార్డు దక్కించుకున్నప్పటికీ ఆయన సాధించిన విజయం వెనుక పాప మూటగట్టుకోక తప్పలేదు. ఎందుకంటే మాల సామాజిక వర్గంలో ఉపకులాల సంఖ్య వేళ్ళ మీద లెక్కపెట్టే అంత మాత్రమే ఉంది. కానీ మందకృష్ణ మాదిగ చెప్పిన లెక్కలు చూస్తే పూర్తిగా లక్షల్లో జనాభా ఉంది అని చెప్పిన ఆ పాపం ఇప్పుడు పండి మాల కులస్తులకు ఉపకులాలు ఏంటో తెలియక తికమక పడుతూ కులాల సర్టిఫికెట్ల జారీ విషయంలో అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు.. వర్గీకరణ పేరుతో షెడ్యూల్ తెగల వారిని విడగొట్టి బాగానే ఆస్తులు కూడా పెట్టుకున్న వర్గీకరణ వాదులు ఇప్పుడు ఎస్సీ సామాజిక వర్గంలో మాలకునానికి చెందిన వాళ్ళకి భావితరానికి కుల దృవీకరణ పత్రాలు జారీ చేయడం విషయంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. దీనికి కారణం ఎవరిని నిందించాలి... ఏమని ప్రశ్నించాలి.. అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిపోతుంది. మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎండ్లకు ఏండ్లు ఉద్యమం చేసి అటు తెలుగుదేశం పార్టీ ఇటు బిజెపి పార్టీతో మమేకమై మాదిగ ఓట్లన్నీ బిజెపికి తెలుగుదేశానికి వేయాలని చెప్పిన మందకృష్ణ మాటలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అందుకనే సాక్షాత్తు భారత దేశ ప్రధాని సంకలో దూరి తలకాయ పెట్టి పద్మశ్రీ అవార్డు అయితే తెచ్చుకున్నాడు తాను పన్నిన పథకం సక్సెస్ చేసుకున్నాడు. కానీ వర్గీకరణ పేరుతో విడగొట్టబడి ఎస్సీ సామాజిక వర్గాల్లో మాల ఉపకులానికి చెందిన వాళ్లు కుల ధ్రువీకరణ పత్రం నోచుకోక మంత్రుల చుట్టూ ఎమ్మార్వోల చుట్టూ ఎండిఓల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ నానా యాతన పడుతున్నారు.. దీనికి ప్రధాన కారకులు ఎవరు అంటే వర్గీకరణ చేసిన వాళ్లే.... గతంలో వర్గీకరణ లేని సమయంలో మాల మాదిగ రెండే కులాలు ఉండేవి కానీ ఇప్పుడు మాల కులంలో నీది ఏ ఉపకులం అని అంటే 2000 సంవత్సరం దాకా ఇంతవరకు ఉపకులం ఏంటో తెలియని మాల కులస్తుల పరిస్థితి చూస్తే దయనీయంగా మారుతుంది... మాల కులంలో మన్నే పంబాలా ఇలా చెప్పుకుంటూ పోతే ఉప కులాల సంఖ్య ఉన్నప్పటికీ వారిలో జనాభా శాతం వేల సంఖ్యలో మాత్రమే ఉంది.. కానీ మందకృష్ణ మాదిగ చెప్పిన లెక్కల ప్రకారం లక్షల్లో మాలో తమ రిజర్వేషన్లు దొంగిలిస్తున్నారని ఉద్యోగాలు కాజేస్తున్నారని నోటికాడి కంచం ఊడ గుంజుకుంటున్నారని చేసిన రాద్ధాంతం పచ్చి అబద్ధాలే... అని తేటతెలమవుతోంది. తాజాగా గ్రూప్ వన్ లో చేర్చిన మాల ఉపకులాల సంఖ్యను చేర్చినైతే చేర్చారు కానీ ఇంతవరకు వారికి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వడానికి వెనుకడుగు వేస్తున్నారు రెవెన్యూ అధికారులు... కుల ధ్రువీకరణ పత్రం రాకపోతే ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉద్యోగాలకు ఎలా అప్లికేషన్ చేసుకోవాలి అని మాల కులస్తులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.... బిజెపికి వత్తాసు పలికే మందకృష్ణ మాదిగ మరి ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపెడతారా...!?

అసలు మాల మాదిగల మధ్య చిచ్చు రగిలించి చలిమంట కాల్చుకున్న మందకృష్ణ మాదిగ వర్గీకరణ అయిపోయిన తర్వాత ఇప్పుడు ఏ పందా ఎత్తుకొని తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు.. వర్గీకరణ తర్వాత మాల సామాజిక వర్గంలో విద్యార్థులు బలి పశువులుగా మారుతుంటే ఎందుకు పట్టించుకోరు... వర్గీకరణ చేసి విడగొట్టడమే ఆయన పన? అన్నట్టుగా వర్గీకరణ రణం వల్ల జరిగిన పాపానికి మాల సామాజిక వర్గంలో రేపటి తరం బలి పశువులుగా మారుతుంది.. ఒకవైపు మాల సామాజిక వర్గంలో ఎస్సీ మాల అనే ధ్రువ పత్రం ఉన్నప్పటికీ ఇప్పుడు తాజాగా విడుదలయ్యే కుల ధ్రువీకరణ పత్రాల్లో మాల కులంలో ఉప కులం ఏంటి అని అడిగిన ప్రశ్నకు మాత్రం అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. మాల కులంలో మాది ఏ ఉపకులం అని వెతుక్కోవడం ఇప్పుడు మాల సామాజిక వర్గంలోని చదువుకున్న భావితరానికి అంతు పట్టలేదు...

ఎవరిని అడగాలి ఎలా కుల ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలి అన్నది ప్రశ్నార్థకంగా మారుతుంది.. ప్రభుత్వాలు అధికారులు రెవెన్యూ సిబ్బంది చేతులెత్తేస్తున్న ఈ తరుణంలో మాల కులానికి చెందిన విద్యార్థులు భావితరం కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే ఇంకా ఎన్ని రోజులు ఇలా నరకయాతన పడాలో ఎంతమంది జీవితాలు బలి కావాల్సిందో ఈ పాపం ఎవరు మూట కట్టుకుంటారో మీరే నిర్ణయించండి...

## భారత్ సమస్యలు పెరగనున్నాయా?




భారత్ ఇమేజ్‌పై ఎలాంటి ప్రభావం ఉంటుంది?

భవిష్యత్తులో కూడా" అని అన్నారు. అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడిని మోదీ ప్రస్తావించారు. ఈ దాడిలో దాదాపు 1,200 మంది మరణించారు. 250 మందికి ప్రజలను బందీలుగా తీసుకెళ్లారు. ఈ దాడులకు ముందు, ఇజ్రాయెల్ పర్యటనలో పాలస్తీనా హక్కుల అంశాన్ని లేవనెత్తాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రధాని మోదీని కోరారు. భారత్, ఇరాన్ మధ్య బలమైన, చారిత్రక సంబంధాలను అరాఘ్చి మరోసారి గుర్తుచేశారు. భారత్ తమకు మిత్రదేశమని తెలిపారు. అయితే, అరాఘ్చి విజ్ఞప్తిని తన ఇజ్రాయెల్ పర్యటనలో ప్రధాని మోదీ ప్రస్తావించలేదు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన తర్వాత వెంటనే జరిగిన ఈ దాడితో భారత్‌కు ఇబ్బందులు బాగా పెరిగాయని, భారత్ ముందు గందరగోళ పరిస్థితి తలెత్తిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేసిన ఈ దాడి భారతదేశ ఆర్థిక వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుందని.. ఇజ్రాయెల్, ఇరాన్‌లలో నివసిస్తున్న భారతీయ పౌరులను సురక్షితంగా తిరిగి తీసుకురావడంలో సమస్యలు ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయులు అన్ని సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని, రాయబార కార్యాలయాలతో టచ్‌లో ఉండాలని భారత్ సూచించింది. దీనికి సంబంధించి భారత రాయబార కార్యాలయాలు అడ్వైజరీలు జారీ చేశాయి. "ఈ ప్రాంతంలో ప్రస్తుత భద్రతా పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని, ఇజ్రాయెల్‌లోని భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అన్ని వేళలా జాగ్రత్తగా ఉండాలని'' భారత రాయబార కార్యాలయం తెలిపింది.

**'చమురు ధరలు పెరిగే అవకాశం'**

ఇరాన్‌పై చేస్తున్న ఈ దాడులు అనేక విధాలుగా ప్రభావం చూపుతాయని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో నెల్సన్ మండేలా సెంటర్ ఫర్ పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్‌లో ఫ్యాకల్టీ సభ్యుడు ప్రేమానంద మిశ్రా భావిస్తున్నారు. "ఇరాన్, ఇజ్రాయెల్‌తో భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై అమెరికా ప్రభావం గణనీయంగా ఉంటుంది.

అమెరికా ప్రభావం ఏదో ఓ విధంగా భారత సార్వభౌమత్వాన్ని కూడా ప్రశ్నార్థకం చేస్తుంది. ఇరాన్, ఇజ్రాయెల్‌తో ఎంత వరకు ముందుకెళ్లాలనే విషయంలో భారత్ ఎప్పుడూ సందిగ్ధంలో ఉంటుంది" అని ఆయన అన్నారు. ఈ దాడి చమురు సరఫరా పరంగా భారత్‌పై భారీ ప్రభావాన్ని చూపుతుందని ప్రేమానంద అభిప్రాయపడ్డారు. "భారత్‌కు వచ్చే చమురు సరఫరాలో దాదాపు 50 శాతం హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారానే జరుగుతుంది. ఇటీవలి కాలంలో, భారత్ ఈ మార్గం ద్వారా చమురు సరఫరాను బాగా పెంచుకుంది" అని ఆయన అన్నారు. "రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో ఏర్పడిన ఒత్తిడి ఈ మార్గంపై భారత్ ఆధారపడటాన్ని మరింత పెంచింది. చమురు కోసం భారత్‌కు ఎర్ర సముద్రం అనే మరో మార్గం ఉంది. చమురు సరఫరాల కోసం భారత్ ఇరాన్‌పై ఆధారపడదు. కానీ ఈ మార్గం భారత్‌కు చాలా ముఖ్యమైనది. ఈ ఉద్రిక్తత పెరిగితే, అది భారత ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది" అని విశ్లేషించారు. రానున్న రోజుల్లో భారత్ చమురు ధరల పెరుగుదల సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుందని మిడిల్ ఈస్ట్ ఇన్‌సైట్స్ ప్లాట్‌ఫామ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శుభదా చౌధురి అభిప్రాయపడ్డారు. "ఇరాన్‌కు మద్దతుగా హోర్ముజ్ జలసంధిని, ఎర్ర సముద్ర చమురు మార్గాన్ని లక్ష్యంగా చేసుకుంటామని హూతీ తిరుగుబాటుదారులు చెప్పారు. ఇది ఆ మార్గం ద్వారా చమురు సరఫరా చేసే కంపెనీలకు సవాలును పెంచుతుంది. ఇది భవిష్యత్తులో చమురు ధరలలో భారీ పెరుగుదలకు దారితీయవచ్చు" అని అన్నారు. " ఇరాన్ నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోదు. కానీ, చమురు కోసం గల్ఫ్ దేశాలపై భారత్ ఎక్కువగా ఆధారపడి ఉంది" అని తెలిపారు.

దక్షిణాసియాలో తనను తాను అగ్రగామిగా చూపించుకునేందుకు ప్రపంచ స్థాయిలో భారత్ ప్రయత్నిస్తోంది. ఇటీవలి సంవత్సరాలలో బ్రిక్స్‌లో ప్రాముఖ్యత గణనీయంగా పెరిగింది. బ్రిక్స్ అధ్యక్ష పదవి ఈ సంవత్సరం భారత్ దగ్గరుంది. 2024లో ఇరాన్ కూడా బ్రిక్స్ సభ్యదేశంగా చేరింది. గత ఏడాది ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడులను బ్రిక్స్ ఖండించింది. "బ్రిక్స్‌లో ఇరాన్ ఒక ముఖ్యమైన దేశం. కానీ ప్రధాని మోదీ ఇప్పుడే ఇజ్రాయెల్ నుంచి తిరిగి వచ్చారు. దీని కారణంగా ఇరాన్‌పై దాడి బ్రిక్స్ భవిష్యత్తు గురించి కూడా ప్రశ్నలు లేవనెత్తింది. ప్రస్తుతం అమెరికాతో సంబంధాల్లో భారత్ దూరం పెంచేలా కనిపించడం లేదు. విదేశాంగ విధాన నిర్ణయాలు అయినా, ఆర్థిక వ్యవస్థ అయినా, రెండు రంగాలలోనూ భారత్‌కు ఇబ్బందులు పెరుగుతాయి" అని ప్రేమానందమిశ్రా అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ పర్యటన తర్వాత దాడి జరగడాన్ని ప్రేమానంద మిశ్రా విశ్లేషించారు. "దీని గురించి ప్రధాని మోదీకి చెప్పి ఉండాలి. భారత ప్రధాని ఇజ్రాయెల్ పర్యటన జరిగిన వెంటనే ఈ దాడి జరగడం కచ్చితంగా సందేహాస్పదంగా ఉంది. ఇది భారత్ ప్రతిష్టపై ప్రభావం చూపుతుంది. గ్లోబల్ సౌత్ ప్రతినిధిగా ఈ నష్టాన్ని భారత్ ఎలా నియంత్రిస్తుందో చూడాలి" అని అన్నారు. ప్రధాని మోదీ పర్యటన తర్వాత వెంటనే జరిగిన ఈ దాడులు భారత్ సమస్యలను మరింత పెంచాయని శుభదా చౌధురి కూడా భావిస్తున్నారు. "మన స్థానం చాలా వరకు రాజీపడినట్టుగా మారిపోయింది. బ్రిక్స్ అధ్యక్ష పదవి భారత్ దగ్గరుంది. ఇరాన్, రష్యా కూడా బ్రిక్స్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఇది ఒక యుద్ధంలా కనిపిస్తున్నా వాస్తవానికి ఇది ప్రభుత్వాన్ని మార్చడానికి చేస్తున్న ప్రాపగండా'' అని ఆమె చెప్పారు. "ఇజ్రాయెల్ పర్యటనలో మన ప్రధానికి ఒక పతకం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు అయిన నెసెట్ నుంచి వచ్చిన పతకం. ఈ పతకాన్ని ఇంతకు ముందు ఎవరికీ ఇవ్వలేదు. ప్రధాని మోదీ ఎదుర్కొంటున్న సమస్య ఏంటంటే ఇజ్రాయెల్‌ను సందర్శించిన తర్వాత, ఇజ్రాయెల్ చేసిన ఈ దాడిని ఆయన ఎలా ఖండించగలరు?" అని శుభదా చౌధురి ప్రశ్నించారు.

**భారత్ ముందున్న మార్గాలేంటి?**

ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే.. భారత్, ఇరాన్ మధ్య దూరం మరింత పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. "అంతర్జాతీయ ప్రపంచంలో ఉన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా ఒక వైపు ఉండడం ఎప్పుడూ కష్టమైన నిర్ణయం. కానీ, భారత్ వైఖరిలో ఇటీవలి మార్పు, రాబోయే కాలంలో భారత్, ఇరాన్ మధ్య సంబంధాలపై పెద్ద ప్రశ్నార్థకంగా మారుతుందని స్పష్టం చేస్తోంది" అని ప్రేమానంద అన్నారు. "ఇది వాణిజ్య మార్గాలపై కూడా దీని ప్రభావం గణనీయంగా ఉండే అవకాశం ఉంది" అని అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ప్రస్తుత ఉద్రిక్తతలో భారత్ పోషించే పాత్రేంటి? "భారత్ మధ్యవర్తిత్వం వహించలేదు. భారత్ ఆ స్థితిలో లేదు. భారత్‌కు ముఖ్యమైనది ఏంటంటే అది తన ప్రయోజనాలను ఎలా కాపాడుకోగలదు అని." "ఇది గందరగోళ సమయం. కాలం గడిచేకొద్దీ, ఇప్పుడే ప్రారంభమైన ఈ యుద్ధం ఎంత దూరం వెళుతుందో మనకు తెలుస్తుంది. ఈ యుద్ధం చాలా కాలం కొనసాగితే, కచ్చితంగా భారత్‌పై ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని చూపుతుంది. కానీ, భారత్ ప్రతిస్పందన అనిశ్చితంగా ఉంది. ఈ దాడిని భారత్ ఖండించకపోతే, బ్రిక్స్ పెద్ద ఇబ్బందుల్లో పడుతుంది."

# భక్తజనంతో పోటెత్తిన యాదగిరిగుట్ట

■ శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.42.96 లక్షలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి01:**

శ్రీ పంచ నారసింహ క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మ వార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిట కిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కొండ పైన,కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి దర్శన క్యూ లైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం,టికెట్ల విక్రయ కేంద్రాలు,పార్కింగ్,బస్టాండ్, పుష్కరిణి,తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.42,96,548 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,28,600,బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,72,000, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,16,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.7,72,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,11,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,18,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.15,33,890, కల్యాణకట్ట ద్వారా రూ.1,10,000తోపాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**శ్రీవారి సేవలో ప్రముఖులు..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ,సమాచార చట్టం కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి వేర్వేరుగా స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

# మదర్ డెయిరీ అభివృద్ధికి కృషి

■ నేషనల్ మదర్ డైయిరీ డెవలప్ మెంట్ బోర్డు : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట:**



మదర్ డెయిరీ అభివృద్ధికి నేషనల్ మదర్ డైయిరీ డెవలప్ మెంట్ బోర్డు కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, విజయ డైరీ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ డైయిరీ ఛైర్మన్ గుడపాటి మధు సూదన్ రెడ్డితో కలిసి గుజరాత్ లోని నేషనల్ డెయిరీ బోర్డు చైర్మన్‌ను కలిశారు.

ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ మదర్ డైయిరీ సంస్థ బలోపేతం ద్వారా పాల ఉత్పత్తిదారులకు మెరుగైన ధరలు,వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మదర్ డైయిరీ రంగం అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. నేషనల్ డైయిరీ డెవలప్మెంట్ బోర్డు సహకారంతో మదర్ డైయిరీ విస్తరణ,సాంకేతిక ఆధునీకరణ,బలోపేతం వంటి చర్యలు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. రైతులకు శిక్షణ,పశుసంవర్ధక సేవలు,మార్కెటింగ్ సదుపాయాలు అందించడం ద్వారా పాల ఉత్పత్తి రంగంలో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. మదర్ డైయిరీ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని,రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



## ఈనెల 3న యాదగిరిగుట్ట ఆలయం మూసివేత

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి01:**

చంద్ర గ్రహణం కారణంగా ఈనెల 3న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. ఈనెల 3న మధ్యాహ్నం 3.20 నిమిషాలకు సంపూర్ణ చంద్రగ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47 నిమిషాల వరకు చంద్రగ్రహం ఉంటుందని తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంతో పాటు ఉపాలయాలు,అనుబంధ ఆలయాలు మూసివేయనున్నట్లు తెలిపారు. ఈనెల 3న ఉదయం 7 గంటలకు ఆలయాన్ని మూసివేయనున్నట్లు తిరిగి 4న తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్లు తెలిపారు. 4న తెల్లవారుజామున 3 గంటలకు సంపోక్షణ, ఆలయ శుద్ధి అనంతరం యధావిధిగా పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఆలయ వేళల్లో మార్పులు చేసినట్లు తెలిపారు.

# మన్యంకొండ అలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లాలోని మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన దిగువకొండ వద్ద నున్న కొలువుదీరిన శ్రీ అలివేలు మంగతాయారు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపై నున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరిగిన నెల రోజుల తర్వాత దిగువకొండ వద్ద కొలువుదీరిన శ్రీ అలివేలు మంగతాయారు అమ్మ వారి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల మొదటి రోజు అమ్మవారి సన్నిధిలో అంకురార్పణ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రకరకాల పూలు, వివిధ ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దీంతో అమ్మవారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య లతోపాటు దేవాలయం పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**-ఉత్సవాల విశేషోత్సవాలు..**

అమ్మవారి విశేషోత్సవ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈనెల 2న దేవాలయంలో ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, ఎదుర్కోలు, హనుమత్ వాహన సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.3న రాత్రి గరుడవాహన సేవ, విమాన రథోత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈనెల 4న రాత్రి అమ్మవారి అశ్వవాహన సేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.5న వసంతోత్సవం, నాగ వెల్లి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ బలుపులతో శోభాయమానంగా అలంకరించారు.

## 3న మన్యంకొండ ఆలయాల ద్వారబంధం

■ చంద్రగ్రహణం కారణంగా భక్తుల దర్శనాలు నిలిపివేత



**జయభేరి, దేవరకద్ర :**


ఈనెల 3న చంద్రగ్రహణం కారణంగా మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం తో పాటు అనుబంధ దేవాలయాలను ద్వార బంధం చేస్తున్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం తో పాటు అనుబంధ దేవాలయాలైన శ్రీ అలివేలు మంగతాయారు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శివాలయాలలో ద్వార బంధం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఆయా దేవాలయాలలో భక్తుల దర్శనాలను నిలిపి వేస్తున్నారు. ఆ తర్వాత దేవాలయాలలో భక్తుల పూజలను యధావిధిగా కొనసాగించనున్నారు. కావున ఈ విషయంలో దేవాలయానికి భక్తులు సహకరించాలని దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్, అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు లు కోరారు.

## ఆనిమల్ హాస్టల్ కొరకు స్థల పరిశీలన

**జయభేరి, తుగ్గలి:**

తుగ్గలి మండల పరిధిలోని గల రాంపల్లి గ్రామం నందు ఆనిమల్ హాస్టల్ కొరకు అధికారులు మరియు ప్రజాప్రతినిధులు స్థలాన్ని శనివారం రోజున పరిశీలించారు.రాంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు,గ్రామ ప్రజలు రాంపల్లి గ్రామం నందు ఆనిమల్ హాస్టల్ మంజూరు చేయాలని పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాం బాబును కోరడంతో ,రైతుల అభిప్రాయం మేరకు పత్తికొండ శాసనసభ్యులు రాంపల్లి గ్రామం నందు ఆనిమల్ హాస్టల్ ఏర్పాటు కొరకు స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పత్తికొండ శాసనసభ్యులు ఆదేశాల మేరకు తుగ్గలి మండల పశువైద్యాధికారి బాలకృష్ణ గ్రామంలో పర్యటించి ఆనిమల్ హాస్టల్ ఏర్పాటు కొరకు స్థలాన్ని పరిశీలించారు.

ఆనిమల్ హాస్టల్ మంజూరు పై రాంపల్లి గ్రామ ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ జయరాముడు,ఫీల్డ్ అసిస్టెంట్ హేమాద్రి నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి,శంకరయ్య,టిడిపి నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ కానుక రూ. 5016/

■ యాదగిరిగుట్ట 8వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి01 :**

ఎన్నికల సందర్భంగా యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని ఎనిమిదవ వార్డు ప్రజలకు ఇచ్చిన వాగ్దాన ప్రకారం ఎనిమిది వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ వివాహ కానుకలు సమర్పిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ 8వ వార్డు శ్రీరామ్ నగర్ లోని బండారి భారతమ్మనగేష్ చిన్న కుమార్తె విహశ్రీ కమలాక్షివినోద్ కుమార్ వివాహ మహోత్సవం ఫిబ్రవరి 21 తేదీన జరిగింది. వివాహాన్ని పురస్కరించుకొని అదివారం 8వ వార్డులో మాట ఇచ్చిన ప్రకారం యాదగిరిగుట్ట మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ తన కళ్యాణ కానుకగా 5016/రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండ రామస్వామి, వెలిశాల బ్రహ్మాచారి, కొన్యాల నరసింహారెడ్డి, పబ్బాల రాజు, స్వర్గం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బీఎంఎస్ నూతన కార్యవర్గం ఎన్నికయ్యారు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 01:**

యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో బీఎంఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం బీఎంఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా యాదగిరిగుట్ట డిపో సెక్రటరీగా లవయ్య, అధ్యక్షుడిగా జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మల్లేష్, ట్రెజరర్‌గా ఎంకే రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీగా భానుచందర్, జాయింట్ సెక్రటరీలుగా నరసింహ, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకటేష్, కమిటీ సభ్యులుగా శివకుమార్, ఆంజనేయులు, జీవీ కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, ఆర్టీసీ కార్మిక్ సంఘ్ జనరల్ సెక్రటరీ స్వామి కుమార్, అధ్యక్షుడు వెంకటాచారి,ఉపాధ్యక్షుడు అనసూయ, శోభన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నోముల ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నక్క అఖిలేష్ యాదవ్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ డాక్టర్ నక్క అఖిలేష్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణానికి చెందిన గ్యార చంద్రయ్య పక్షవాతం తో కాళ్లు చేతులు పడిపోయి అనారోగ్యంతో ఉన్నందున అతనికి అఖిలేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా 5000 రూపాయల చెక్కు నక్క అన్వేష్ యాదవ్ కోశాధికారి అందజేసినారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేశ్వర్లు చైర్మన్ నక్క సత్యమ్మ, నక్క అనూష వర్ధన్ పృథ్వీరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో 50వేల కోట్లు బీసీలకు కేటాయించాలి

■ సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీలకు బడ్జెట్లో 50వేల కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా జనాభా ప్రాతిపదికన బీసీలకు బడ్జెట్లో 50వేల కోట్ల రూపాయలు తక్షణ ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. దానితోపాటు బీసీ సబ్ ప్లాన్ సబ్సిడీతో కూడినటువంటి బ్యాంకులు రుణాలు కాంట్రాక్టర్లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ప్రభుత్వం త్వరితగతిన చేయాలని పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను 8500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత,నారాయణ యాదవ్,వెంకటేష్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు

- చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి
- కీ"శే"మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకులు మహాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, మార్చి 01 :**

ప్రజల దాహార్తిని తీర్చుటకు చలివేంద్రం ఏర్పాటు. మండుతున్న ఎండల్లో ప్రజలకు చల్లని త్రాగు నీటిని అందించాలనే ఉద్దేశ్యంతో మహాదేవ్ పూర్ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి వారి తండ్రి కీ "శే"మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం రామచంద్ర పూర్ చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు.

"కీ"శే"మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిగా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.... దానాలలో అన్నిటికంటే గొప్పది జలదానమని నీరు జీవానికి ఆధారమని అన్నారు.రహదారుల పై నడిచే ప్రయాణికులు,వృద్ధులు,తదితలు దాహం వేసినప్పుడు ఈ చలివేంద్రం వారి అలసటను తీర్చే ఒక ఆశాకిరణంగా నిలుస్తుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తనయుడు రామ కృష్ణ, ఉమెంతలా సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ తనయుడు గోపాల్, కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్, రేగడిచిలుకమర్రి సర్పంచ్ శ్వేతా శివకుమార్ రెడ్డి, ఉత్తరాస్ పల్లి సర్పంచ్ నందు ఉపసర్పంచ్ అలీం, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, ఉపసర్పంచ్ లు, నాయకులు బంధులాల్, బాబురావు, నరసింహారెడ్డి, నర్సింలు, బుచ్చయ్య, రాజా రామేశ్వర్ రెడ్డి, వెంకటేష్, దర్గా రామచంద్రయ్య, గోపాల్ నాయక్, రామచంద్రయ్య, కుమార్, నరసింహారెడ్డి, సురేష్, బాల్రాజ్, చంద్రశేఖర్, నర్సిములు, నర్సింలు గౌడ్, ఆయా గ్రామాల కమిటీ అధ్యక్షులు వేణుగోపాల్, బైరంపల్లి యాదయ్య, రవీందర్ గౌడ్, రాములు, నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## పెద్దమ్మ ఆలయ కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

- అమ్మవారి కృపా కటాక్షాలతో అందరు సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు వెల్లడి

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 1:**

శామీర్ పేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు మరియు ఓడి బియ్యం సమర్పించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కళ్యాణ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, అమ్మవారి కృపా కటాక్షాలతో అందరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తుంకుంట మున్సిపల్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజు యాదవ్, వంగ వెంకట్ రెడ్డి, పవన్ ముదిరాజ్, నవీన్ ముదిరాజ్, గ్రామస్తులు , భక్తులు పాల్గొన్నారు.

## సామరస్యం పెంపొందించడంలో ఇఫ్తార్ విందుల ముఖ్య పాత్ర

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**జయభేరి, షాద్ నగర్, మార్చి 01 :**

సామరస్యం పెంపొందించడంలో ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర వహిస్తాయని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మిలియన్ టౌన్షిప్ లో యువ నాయకులు కబీర్ తదితరులు ఇచ్చిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ అందెమోహన్, జమృత్ ఖాన్, మహమ్మద్ ఇబ్రహీం, సాదిక్ తదితర మైనార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులతో ఇఫ్తార్ విందులో ఒకరికి ఒకరు ఖర్జూర పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రంజాన్ మాసం శాంతి, సహనం, సేవాభావాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సామరస్యం పెపొందించడంలో ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్ల ప్పుడూ లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వానికి కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ నూతన కార్యవర్గం ఎన్నిక



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 01 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా పడాల శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా కట్కూరి వెంకటేష్, కోట జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, కోశాధికారిగా బోరెడ్డి పురుషోత్తం రెడ్డి, సహాయ కార్యదర్శిగా పాముల జంగయ్య, 20 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

## వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 01 :**

తుర్కపల్లి మండలం గోపాల్ పురం గ్రామంలో ఉచిత మంచినీటి వాటర్ ఫిల్టర్ను గ్రామ సర్పంచ్ గుట్ట సాయిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి దాత గుర్రాల నాగేశ్వరరావు రెడ్డి సహకారంతో ఆరో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశాడు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య దృశ్య పరిశుభ్రమైన త్రాగునీరు అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలు తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. గ్రామంలో నీటి సమస్య తగ్గడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, వార్డు సభ్యులు కాశ బోయిన కనకమ్మ, పుట్ట గీత, దాసరి పరమేశ్వర్, నారం కృష్ణవేణి, కూర కనకయ్య, మల్లెబోయిన అశోక్, మాజీ సర్పంచ్ దాసరి నర్సింలు, మల్లెబోయిన మహేష్, ఉడుత మహేష్, పూలపల్లి శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలరాజ్ పాల్గొన్నారు.



## వృద్ధ మాత ఆశ్రమంలో అన్న ప్రసాదం వితరణ

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మహిళా వృద్ధాశ్రమంలో కీర్తిశేషులు పందిరి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వృధా మాత లకు పందిరి లక్ష్మమ్మ కుమారుడు కోడలు పందిరి వెంకన్న జ్యోతి వాసవి వనత క్లబ్, వాసవి వనిత క్లబ్, వాసవి గ్రేటర్ ఆధ్వర్యంలో వృద్ధ మాతలకు భోజన వసతి కల్పించినారు. వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి మాట్లాడుతూ పెద్దల జ్ఞాపకార్థం వృద్ధ మాతలకు భోజన వసతి కల్పించినందుకు మాకు చాలా ఆనందంగా ఉంది చనిపోయిన వారి ఆత్మ శాంతిస్తుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలంపల్లి పద్మ, నీల సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

- సోమవారం నుంచి సంస్కృత పేపర్ల మూల్యాంకనం.. డిఐఈఓ ఆదేశాలు



**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ప్రక్రియలో కీలక ఘట్టమైన జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్ వేల్యూషన్ ) జిల్లాలో వేగవంతం కానుంది.ఇందులో భాగంగా సంస్కృత సబ్జెక్టుకు సంబంధించిన పేపర్ల కరెక్షన్ సోమవారం నుండి ప్రారంభం కానుంది.ఈ మేరకు అనకాపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలి వినోద్ బాబు ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు.జిల్లా కేంద్రంలోని శ్రీ ఆదినారాయణ మహిళా కళాశాలను సంస్కృత మూల్యాంకన కేంద్రంగా ఎంపిక చేశారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.పరీక్షల షెడ్యూల్ ప్రకారం నేడు జరగాల్సిన పరీక్ష పూర్తయిన వెంటనే, మూల్యాంకన విధులు పొందిన అధ్యాపకులందరూ నేరుగా క్యాంపునకు చేరుకోవాలని స్పష్టం చేశారు. సాధారణంగా ఫలితాలను త్వరగా విడుదల చేయాలనే లక్ష్యంతో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఈ ఏడాది మూల్యాంకన ప్రక్రియను పరీక్షలు జరుగుతున్న సమయంలోనే ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సంస్కృత భాషకు సంబంధించి వాల్యూషన్ ఆర్డర్స్ పొందిన అధ్యాపకులు విధిగా హాజరై, డిఐఈఓకి రిపోర్ట్ చేయాలని కోరారు. సమయపాలన పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా మూల్యాంకనం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

## యువత వ్యాపారంగంలో రాణించాలి

- సాయి ఫ్యాషన్ స్టోర్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**జయభేరి, షాద్ నగర్, మార్చి 01 :**



యువత వ్యాపార రంగంలో రాణించాలని, వారించుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం పరిగి రోడ్డులో ఎలికట్ట మాజీ సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన సాయి ఫ్యాషన్ స్టోర్ ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....స్థానిక యువత వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. షాద్ నగర్ అభివృద్ధికి ఇలాంటి కొత్త వ్యాపార సంస్థలు దోహదపడతాయని అలాగే, సాయిప్రసాద్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలిపారు.సాయి ఫ్యాషన్ స్టోర్ మంచి లాభాలు సాధిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, వేణుగోపాల్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ లైబ్రరీ చైర్మన్ లక్ష్మీనరసింహా రెడ్డి, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, శివ ఎస్పీ, మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు చెర్క శివ, వినోద్, రామస్వామి, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపుకు వచ్చిన ప్రజలకు ఆరోగ్య పరీక్షలు

- ఘట్కేసర్ హోలీ ఫేత్ స్కూల్ ఎదురుగా మమత ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభోత్సవం
- చామకూర మల్లారెడ్డి, మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు

**జయభేరి, ఘట్కేసర్ :**



మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో మల్లారెడ్డి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపును బండారి శ్రీనివాస్ గౌడ్ అదర్యములో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంప్ ను ఘట్కేసర్ ex వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్స్ కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్, కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, పల్లె విజయ్ సందర్శించడం జరిగింది. హెల్త్ క్యాంపుకు వచ్చిన ప్రజలకు ఆరోగ్య పరీక్షలతో పాటు కావాల్సిన మందులు ఉచితంగా అందివడం జరిగింది. లాల్ బహద్దూర్ స్మరక యువజన సంఘము బిల్డింగ్ ప్రారంభోత్సవంలోఘట్కేసర్ పెద్దలు అందరు పాల్గొనడము జరిగింది. జిహెచ్ఎంసి ఘట్కేసర్ హోలీ ఫేత్ స్కూల్ ఎదురుగా మమత ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఫిజియోథెరపీ సేవలు ఘట్కేసర్ లో ప్రారంభించడం ఘట్కేసర్, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ఫిజియోథెరపీ క్లినిక్ లో క్రింది సేవలను అందిస్తారు.

## మన చిన్న సహాయం.. ఒక చిన్నారి జీవితాన్ని కాపాడగలదు



- దాతలు ముందుకు రావాలని పిలుపు
- SMA వ్యాధితో ప్రాణాల కోసం పోరాడుతున్న చిన్నారి ఆర్యన్స్‌కు అండగా ఏనుగు సుదర్శన్ రెడ్డి
- అతని కళ్లలో జీవించాలనే ఆశ ఉంది మన చేతుల్లో అతని భవిష్యత్తు ఉంది
- ఒక ఇంజెక్షన్, ఒక జీవితం, ఒక అవకాశం దయచేసి సహాయం చేయండి

**జయభేరి, పోచంపల్లి :**

జూలూరు గ్రామానికి చెందిన చిన్నారి ఆర్యన్స్ Spinal Muscular Atrophy (SMA) Type2 అనే అరుదైన ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి కారణంగా చిన్నారి శరీరం రోజురోజుకు బలహీనపడుతూ, నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. చిన్న వయస్సులోనే తీవ్రమైన ఆరోగ్య సమస్యతో పోరాడుతున్న ఈ బాలుడి పరిస్థితి కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నారి కుటుంబ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి నివాసంలో కలసి తమ బిడ్డ పరిస్థితిని వివరించారు. చిన్నారి పరిస్థితిని విన్న సుదర్శన్ రెడ్డి తీవ్రంగా మనసు కృంగిపోయి, తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా వైయస్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు మరియు భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు, అలాగే దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైద్యుల సూచన మేరకు ఆర్యన్స్ పూర్తిగా కోలుకోవాలంటే ఒకే ఒక్క ప్రత్యేక ఇంజెక్షన్ అవసరమై, దాని ఖర్చు సుమారు రూ.1 కోటి 50 లక్షలు అవుతుందని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు అంత భారీ మొత్తాన్ని సమకూర్చలేని పరిస్థితిలో ఉండటంతో, తమ బిడ్డ ప్రాణం కాపాడాలని దాతలను వేడుకుంటున్నారు. చిన్నారి ఆర్యన్స్ సాధారణ పిల్లల్లా ఆరోగ్యంగా జీవించాలంటే సమాజం మొత్తం సహకారం అవసరం ఉంది. దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి సహాయం అందిస్తే చిన్నారి జీవితానికి కొత్త ఆశ కలుగుతుందని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**సహాయం కోసం వివరాలు:**

తల్లిదండ్రులు: నవీన్ & కిరణ్, ఫోన్ / ఫోన్‌పే / గూగుల్ పే: 99632 92482 (A. Naveena) ఇన్‌స్టాగ్రామ్: @aryansh_fights_sma_type2.

# షాద్ నగర్ లో డిసిపి కార్యాలయం ప్రారంభం




**జయభేరి, షాద్ నగర్, మార్చి 01 :**

రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని మిలీనియం టౌన్షిప్ లో ఏర్పాటు చేశారు. ఆదివారం డిసిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. డిసిపి శిరీష రాఘవేందర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఫ్యూచర్ సిటీలో భాగంగా షాద్ నగర్ ప్రాంతాన్ని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్థాయిని ప్రభుత్వం ఏర్పాటు చేయటంతో ఉన్నత అధికారులు నియామకాలు జరిగాయి.

తొందరలో పట్టణంలో శాశ్వత కార్యాలయం ఏర్పాటు కోసం స్థల పరిశీలన జరుగుతుంది అని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ... షాద్ నగర్ పట్టణ ప్రజలకు నేటి నుంచి అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో శాంతిభద్రతలను కాపాడడానికి ప్రజలకు ఫ్రెండ్లీ పోలీస్ గా రక్షకభటులు అందరూ అందుబాటులో ఉంటారని డిసిపి తెలిపారు.

**నగరంలో నలుదిక్కులు పోలీసుల నిఘా....**

షాద్ నగర్ లో అన్ని దిక్కులు పూర్తిస్థాయిలో పోలీసుల నిగా మరింత పట్టిష్టంగా ఏర్పాటు చేశామని, ఎక్కడ ఎటువంటి ఆటంకాలు జరిగిన క్షణంలో పోలీసులు అందుబాటులో ఉంటారని డిసిపి శిరీష అన్నారు. పోలీసులు నిర్వహించిన అవగాహన సదస్సులో కూడా ప్రజలకు, వాహన దారులకు పలు సూచనలు చేశామని, పోలీసు అధికారులు సూచించిన సూచనలు వాహనదారులు కచ్చితంగా పాటించాలని అన్నారు.
నగరంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయని సరైన ఆధారాలు లేని వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడపడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చట్టపరమైన శిక్షలు కూడా నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే ఏ ఒక్కరు కూడా చట్టం నుంచి తప్పించుకోలేని డిసిపి పేర్కొన్నారు.

# మదర్ డైరీ కి పూర్వవైభవం

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 01 :**



మదర్ డైరీ కి పూర్వ వైభవం వస్తుందని మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి లతో కలిసి గుజరాత్ లో నేషనల్ డైరీ డెవలప్మెంట్ చైర్మన్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల్లో మదర్ డైరీ ని హ్యాండోవర్ చేసుకొని 10 కోట్ల రూపాయల నిధులు ఇవ్వనున్నట్లు ఎన్డీడీపీ చైర్మన్ తెలిపినట్లు మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కోరిక మేరకు మదర్ డైరీని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకు రావడానికి ఎన్డిడిబి కృషి చేస్తామని అన్నట్టు తెలిపారు. మదర్ డైరీ పరిపాలన వ్యవహారాలు మదర్ డైరీ చూడగా ఎన్డిటివి మాత్రం ఆర్థిక వ్యవహారాలు మార్కెటింగ్ ఉన్నట్టు తెలిపారు .ఈరోజు చర్చలు సఫలం అవడం పట్ల మంత్రి వాకిటి శ్రీహరికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారు. అతి త్వరలో రైతులకు పాల బిల్లులను అందజేయనున్నట్లు తెలిపారు. రైతుల అధైర్య పడవద్దు అని గతంలో మాదిరిగా మదర్ డైరీ పూర్వ వైభవంతో నడవడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎన్డిడీబీ సహకారంతో రైతులందరికీ న్యాయం చేసే విధంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 01 :**



తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం సిసి రోడ్డు పనులకు సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి 10 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవే లక్ష్యంగా, గ్రామాభివృద్ధి కోసం పాటుపడుతున్నామని అన్నారు. ప్రజలు నమ్మకంతో ఓట్లేసి గెలిపించినందుకు గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పార్వతి చిన్న నాయక్, వార్డు సభ్యులు సునీత నవీన్ రెడ్డి, ఓర్సు రాములు, సరిత రమేష్, నర్సింహులు, మహేష్, నరేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుమార్, రవి, నరేష్‌నాయక్, నర్సింహ, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ హక్కుల దండోరా..

- అమరవీరుల త్యాగాల వల్లనే వర్గీకరణ
- ఎస్సీ వర్గీకరణ కు అమరవీరుల త్యాగాలే ప్రధాన కారణం.
- అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్
- మాదిగ హక్కుల దండోరా గజ్వెల్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్ల నరేందర్



**జయభేరి, గజ్వేల్, మార్చి 01 :**

ఎస్సీ వర్గీకరణ తోపాటు, మాదిగలకు రావాల్సిన హక్కులు సాధించడానికి మాదిగ అమరుల త్యాగాలే ప్రధాన కారణమని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ అన్నారు.ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో మాదిగ హక్కుల దండోరా గజ్వెల్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్ల నరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు విద్య ఉద్యోగ అవకాశాలు వచ్చాయంటే అందుకు కారకులు అమర వీరులేనని చెప్పారు. వారి త్యాగాల ద్వారా ఉద్యమాన్ని నిలబెట్టి హక్కుల సాధనకు మార్గం వేసిన మార్గ దర్శకులని కొనియాడారు. అలాంటి వీరుల త్యాగాలను మాదిగ యువత, విద్యార్థి లోకం స్మరించుకొని.. వారి ఆశయాలు కొనసాగించాలని తెలిపారు.అమరవీరుల కుటుంబాలకు ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యగం, మరియు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ లో మాదిగ అమర వీరుల స్తూపం నిర్మించడానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా అధికార ప్రతినిధి ఎల్కపల్లి రాజేందర్ మాదిగ, సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బాల్ రెడ్డి,అసైడ్ భూముల జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీను, ఉప సర్పంచ్ నల్ల పరుశురాం మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు గుండ్ల అశోక్, రవి, ఆదాసు సురేందర్, ఉద్దెమారి వెంకటేష్, బొగ్గుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సీతారాముల కటాక్షంతో ఆలయ నిర్మాణానికి శుభారంభం

- స్లాబ్ పనులను ప్రారంభించిన ఏనుగు సుదర్శన్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పిర్జాదిగూడ డివిజన్, మేడిపల్లి ప్రాంతంలో ఉన్న పవిత్ర శ్రీ రామాలయం భవన నిర్మాణ పనులకు ఈరోజు శుభముహూర్తంలో మరొక మహత్తర దశ ప్రారంభమైంది. మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఐదు లక్షల రూపాయల సొంత నిధులతో ఆలయ భవనం స్లాబ్ పనులను చేపట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి స్లాబ్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల నడుమ, భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల ఆశీస్సులు కోరుతూ పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మాణం అనేది కేవలం భవనం నిర్మాణం మాత్రమే కాకుండా, సనాతన ధర్మ పరిరక్షణకు, భక్తి భావాల పెంపుకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు నిలయంగా నిలిచే ఈ ఆలయం త్వరితగతిన పూర్తి కావాలని, ప్రతి భక్తుడికి దైవ దర్శనం కలిగే పవిత్ర క్షేత్రంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా సమాజంలో ధర్మం, భక్తి, సంస్కృతి పరిరక్షణకు తనవంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు బండారు పవన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ సీతారాముల కృపాకటాక్షాలు అందరికీ కలగాలని ప్రార్థించారు.

# ఆధ్యాత్మికరంగంలో తగిన కృషి

**జయభేరి, ఘట్కేసర్ :**

GHMC ఘట్కేసర్ సర్కిల్ ఎదులాబాద్ రోడ్డు మేదా హౌసింగ్ సొసైటీ పక్కన శ్రీకృష్ణానంద మఠము నూతన భవనముల నిర్మాణం సందర్భంగా నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొన్న ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మేధా చైర్మన్ యుగేందర్ రెడ్డి. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. హవనయజ్ఞముశ్రీకృష్ణానంద మఠము గత 70 సంవత్సరములుగా ఆధ్యాత్మికరంగంలో తగిన కృషి చేస్తున్నది. మఠం వ్యవస్థాపకులు పరమపూజ్యులైన శ్రీగురుదేవులు, మానవజాతిని మేలుకొల్పుటకు సర్వశాస్త్రముల సారాంశమును సామాన్యప్రజలకు కూడా అర్థమయ్యేటట్లు సరళమైన భాషలో ప్రవచనముల ద్వారానూ, ప్రవచనగ్రంథముల ద్వారానూ ప్రచారం చేశారు. పేరు.. ఫోటోల చిహ్నంకూడా త్యజించి, 1974 లో భౌతిక కాయమును విడిచేశారు. ప్రస్తుతం, అదే ఆదర్శంతో పరంపర కొనసాగుతున్నది. ఇప్పటివఱకు శ్రీకృష్ణానంద మఠం, దిల్ సుఖ్నగరము, హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగ ఆధ్యాత్మికసేవలు అందిస్తున్నది. ఆంధ్రప్రదేశం, కడప జిల్లా మోరగుడి గ్రామంలో, ఇంకా కృష్ణాజిల్లా మొవ్వ గ్రామంలోనూ శాఖలు ఉన్నవి. ఇప్పుడు ఘటకేసరంలో కొంత విశాలమైన ప్రాంగణంలో మఠం ఏర్పాటుచేసి సేవలను అందించే ప్రయత్నం చేస్తున్నది. ఈ సందర్భంగా భూమి పూజ మరియు భగవద్గీతా హవన యజ్ఞము చేయుటకు సంకల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, ప్రముఖులు, నాయకులు, పిటాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.



# జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం, ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీలో జనసేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు పార్టీ అధిష్టానం ఆదేశాలు మేరకు జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీలో కొత్తగా సభ్యత్వం నోమెదు చెయ్యించుకొంటున్నామనీ సభ్యత్వం వలన పార్టీ ద్వారా వచ్చే బనిఫిట్స్ గురించి వివరించమని వారు తెలియజేసారు. జనసేన సభ్యత్వం తీసుకొన్న జనసేనలకు ప్రమాదంలో మరణిస్తే 5 లక్షలు,గాయపడితే 2 లక్షలు పార్టీ నుంచి అందుతుందని తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో బొంది దుర్గారావు, సమ్మంగి అప్పారావు, చింతకాయల ముత్యాలు(అయ్యన్న), సూరాడ మహేష్,తిత్తి శివాజీ, సమ్మంగి మున్నా,సూరాడ అమ్మోరు, చింతకాయల ముత్యాలు (పోములోడు), అర్జిల్లి శ్రీను,చింతకాయల అప్పలరాజు, అర్జిల్లి అప్పలరాజు, కొవిరి శివ బొంది అప్పలరాజు,ఎమ్ పోలరాజు తదితర జన సైనికులు పాల్గొన్నారు.

# 30 పడగల ఆసుపత్రికి శంకు స్థాపన



**జయభేరి, చర్ల, మార్చి 1 :**

మండల ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించేందుకు.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నూతన ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ 30 పడకల హాస్పిటల్ అందుబాటులోకి వస్తే మారు మూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే లభిస్తాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా నాణ్యమైన చికిత్స అందించాలని మంత్రి ఈ సందర్భంగా వైద్యులకు సూచించారు

# అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన దినేష్.

- మలేషియాలో జరిగే టెస్ట్ సిరీస్ లో పాల్గొంటున్న విద్యార్థి
- విద్యార్థిని అభినందించిన కళాశాల యాజమాన్యం




**జయభేరి, శామీర్ పేట్, మర్చి 1:**

మలేషియాలో జరిగే అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. కూకట్ పల్లిలోని హనుమాన్ నగర్ కు చెందిన జీ.దినేష్ కుమార్ మేడ్చల్ జిల్లా శామీర్ పేట లోని హాజీ గౌస్ పీరాన్ మెమోరియల్ కళాశాలలో బీపీడీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. కాగా మార్చి 1 నుండి 4వ తేదీ వరకు మలేషియాలోని కౌలాలంపూర్ లో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శర్ఫుద్దీన్, సెక్రటరీ వసీం అబ్రార్, ప్రిన్సిపల్ బలుగూరి గోపి లు విద్యార్థి దినేష్ కుమార్ ను అభినందించారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థి అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికకావడం ఎంతో సంతోషంగా ఉందని, వారు ఆనందం వ్యక్తం చేశారు. అక్కడ కూడా తన ప్రతిభను చాటి విజయంతో తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రవి కుమార్, రాజు, సంతోష్ పిరాన్, సుధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 16 న అలియాబాద్ లో చిత్తారమ్మ, పెద్దమ్మ జాతర మహోత్సవాలు

- వేడుకలకు హాజరుకావాలని బిఆర్ఎస్ కౌన్సిలర్ యమున శ్యామ్ కు ఆహ్వానం



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 1:**

అలియాబాద్ గ్రామంలో ఈ నెల 16 న ముదిరాజ్ ల ఆరాధ్య దైవం అయిన చిత్తారమ్మ, పెద్దమ్మ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా ఈ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ యమున శ్యామ్ ను ముదిరాజ్ సంఘం నేతలు ఆహ్వానించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ తనను ఈ వేడుకలకు ఆహ్వానించినందుకు ముదిరాజ్ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ జాతర మహోత్సవాలకు హాజరవుతానని వెల్లడించారు.



## చాలా గ్యాప్ తర్వాత మళ్లీ రీఎంట్రీ ఈ ముద్దుగుమ్మ


తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది కామ్న జెర్మలానీ. 2005లో ప్రేమికులు సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీ లోకి అడుగు పెట్టిందీ అందాల తార. బెండు అప్పారావు ఆర్ ఎంపీ, రణం, సామాన్యుడు సినిమాలతో తెలుగులో ఫేమస్ హీరోయిన్ గా బాగా పాపులర్ అయింది. టాస్, కింగ్, సైనికుడు, అందమైన అబద్ధం, రాజాధి రాజా, కత్తి కాంతారావు, యాక్షన్ త్రీడీ, శ్రీ జగద్గురు ఆది శంకర తదితర సినిమాల్లోనూ హీరోయిన్ గానూ, సహాయక నటిగానూ మెప్పించింది. అయితే 2015 చంద్రిక సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మకు సినిమా అవకాశాలు కరువయ్యాయి. దీంతో ఇండస్ట్రీకి దూరమైంది. తెలుగుతో పాటు కన్నడ, మలయాళం సినిమాల్లో కూడా నటించిందీ అందాలతార. పెళ్లి, పిల్లల కారణంగా సుమారు ఏడేళ్లు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఈ సొగసరి 2022 వ సంవత్సరం లో 'గరుడ' అనే కన్నడ చిత్రం తో రీ ఎంట్రీ ఇచ్చింది. కానీ పెద్దగా క్లిక్ అవ్వలేదు. ఆ తర్వాత 2023లో వ్యవస్థ, 2024లో నెట్ వర్క్ అనే వెబ్ సిరీస్ ల్లోనూ మెరిసింది కామ్న జెర్మలానీ. ఇక ఈ ఏడాది కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన కే ర్యాంప్ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించిందీ అందాల తార. తన స్క్రీన్ ప్రజెన్స్ తో తెలుగు ఆడియెన్స్ ను మెస్మరైజ్ చేసింది. సినిమా కూడా సూపర్ హిట్ అయ్యింది. దీంతో ఈ ముద్దుగుమ్మకు మరిన్ని సినిమా అవకాశాలు వస్తాయేమో చూడాలి.



## విజయ్, రష్మిక వెడ్డింగ్ రిసెప్షన్..

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇటీవలే వివాహబంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే.. గతకొన్నాళ్ళుగా ప్రేమలో ఉన్న విజయ్ రష్మిక ఎట్టకేలకు పెళ్లి చేసుకోవడంతో అభిమానులు ఆనందంలో తేలిపోతున్నారు. వీరి వివాహం ఉదయ్ పూర్ లో ఫిబ్రవరి 26న గ్రాండ్ గా జరిగింది. వీరి వివాహానికి కొద్దిమంది అతిథులు, కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. విజయ్, రష్మిక వివాహం హిందూ సాంప్రదాయ పద్దతిలో అలాగే కొడవ పద్దతిలో జరిగింది. అలాగే మార్చ్ 4న విజయ్, రష్మిక రిసెప్షన్ వేడుక హైదరాబాద్ లో జరగనుంది. ఈ వేడుకలు సినీ సెలబ్రెటీలతో పాటు అభిమానులు కూడా భారీగా హాజరు కానున్నారు. ఈ క్రమంలో అభిమానులకు విజయ్, రష్మిక ఓ విజ్ఞప్తి చేశారు. మార్చ్ 4న జరగనున్న రిసెప్షన్ వేడుకకు ఆహ్వానం లేనిదే అభిమానులు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకకు సినీ ప్రముఖుల తో పాటు రాజకీయ ప్రముఖులు హాజరుకానుండడంతో భారీ భద్రత ఏర్పాటు చేయనున్నారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో అభిమానులు విజయ్, రష్మిక రిసెప్షన్ కు ఆహ్వానం లేనిదే రావొద్దు , వచ్చి ఇబ్బందిపడొద్దు అంటూ రిక్వెస్ట్ చేశారు. అభిమానులు, శ్రేయోభిలాషుల క్షేమమే తమకు ముఖ్యమని చెప్పుకొచ్చారు విరోష్ జంట. ఇక విజయ్ రష్మిక కలిసి రెండు సినిమాల్లో నటించిన విషయం తెలిసిందే.. గీతగోవిందం సినిమాలో తొలిసారి ఈ జంట కలిసి నటించారు. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆ సమయంలోనే ఈ ఇద్దరి మధ్య ఫ్రెండ్ షిప్ ఏర్పడిందని తెలుస్తుంది.. ఈ పరిచయం రెండో సినిమా సమయానికి ప్రేమగా మారిందని తెలుస్తుంది. చాలా కాలం విజయ్, రష్మిక వారి రిలేషన్ ను సీక్రెట్ గా ఉంచారు.

## హృతిక్ హీరోగా సౌత్ సినిమా?




గత ఏడాది 'వార్ 2'తో పానిండియా ఆడియన్స్‌ని పలకరించిన హృతిక్ రోషన్.. తర్వాతి ప్రాజెక్ట్‌గా స్వీయ దర్శకత్వంలో 'క్రిష్ 4' చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్‌కి వెళ్తుందా అని ఎదురు చూసిన హృతిక్ అభిమానులకు ఇప్పుడు నిరాశే మిగిలింది. కారణం.. హృతిక్ ప్రస్తుతానికి 'క్రిష్ 4'ను పక్కనపెట్టారట. దానికంటే ముందు మరో ప్రాజెక్ట్‌ని పూర్తి చేయాలని ఆయన నిశ్చయించారట.ఆ వివరాల్లోకెళ్తే. కన్నడ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్‌స్‌తో ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేసేందుకు హృతిక్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది హృతిక్ చేయనున్న తొలి సౌతిండియా సినిమా కావడం విశేషం. ఈ సినిమా పూర్తి చేసిన తర్వాతే 'క్రిష్ 4'ని పట్టాలెక్కించాలని హృతిక్ భావిస్తున్నారట. ఇక హోంబలే వారితో హృతిక్ చేయబోయే ప్రాజెక్ట్‌కి సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

## సమంత 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ'




సినిమాల్లో సూపర్ స్టార్‌గా బిజీగా ఉన్న దశలోనే తన శరీరంలో వచ్చిన మార్పులతో ఒక్క సారిగా షాక్ అయింది సమంత. తనకు వచ్చింది రేర్ డిసీజ్ అని.. అది తన దేహంలో ఉన్న కండరాలను క్షీణించేలా చేస్తుందని తెలుసుకుని ఢీలా పడింది.కానీ కృంగిపోలేదు.. షార్ట్ గ్యాప్‌లోనే తనకొచ్చిన మయోసైటిస్ వ్యాధిపై పోరాటం మొదలెట్టింది. మొక్కవోని విశ్వాసంతో.. ట్రీట్మెంట్, డైట్, వర్కవుట్స్‌తో బౌన్స్ బ్యాక్ అయింది. మళ్లీ క్రమంలోనే తన దినచర్య గురించి డైట్ గురించి.. ఓ ఇంటర్వ్యూలో వివరించింది ఈ బ్యూటీ. దీంతో ఆమె డైట్ కాస్తా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ప్రముఖ ఇంటర్నేషనల్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమంత తన రోజువారీ దినచర్య గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ప్రతిరోజూ ఉదయాన్నే నిద్రలేవడం ఆమెకు అలవాటు. మేల్కొన్న తర్వాత కొద్దిసేపు ప్రార్థనలు చేసుకుని, బయట ప్రకృతిలో సూర్యరశ్మి తగిలేలా కాసేపు గడుపుతుంది. ఆ తర్వాత ధ్యానం చేస్తుంది. ఈ ప్రక్రియ కోసం ఆమె సుమారు ఒకటిన్నర గంటల సమయం కేటాయిస్తుంది. ఈ 'మీ టైమ్' కాన్సెప్ట్ తనను మానసికంగా దృఢంగా ఉంచుతుందని సమంత నమ్ముతోంది. అంతేకాదు సామ్ తన డైట్ గురించి కూడా చెప్పుకొచ్చింది. దాదాపు ఒక సంవత్సరం పాటు తాను ప్రతిరోజూ ఒకే రకమైన కూరగాయలు, చికెన్ వంటకాలను మాత్రమే తిన్నానని చెప్పుకొచ్చింది. మయోసైటిస్ సమస్య ఉన్నప్పుడు కొన్ని ఆహార పదార్థాలు శరీరంలో మంటను పెంచుతాయని.. అందుకే ఎటువంటి రిస్క్ తీసుకోకుండా తన శరీరాన్ని హీలింగ్ చేసుకోవడమే లక్ష్యంగా ఒకే రకమైన ఫుడ్ తీసుకున్నట్టు సమంత చెప్పింది. ఇక ప్రముఖ పోషకాహార నిపుణుడు రయాన్ ఫెర్నాండోతో జరిగిన సంభాషణలో.. సమంత మరిన్ని వివరాలు పంచుకుంది. తాను ప్రస్తుతం 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' డైట్‌ను అనుసరిస్తున్నట్టు చెప్పుకొచ్చింది. చిన్నతనంలో తాను ఏది తిన్నా బరువు పెరిగేదాన్ని కాదని.. , అందుకే ఆహారం విషయంలో అశ్రద్ధగా ఉండేదాన్నంటూ చెప్పుకొచ్చింది. కానీ ఇప్పుడు ఆరోగ్యం అంటే కేవలం బరువు తగ్గడం కాదనే విషయం తనకు తెలిసిందని.. అందుకే తన శరీరం ధర్మాన్ని.. అర్థం చేసుకుని తన డైట్‌లో మార్పులు చేసుకున్నట్టు చెప్పుకొచ్చింది సామ్.

## టాక్సిక్ మూవీలో గ్లామర్ బ్యూటీ..



ప్రస్తుతం మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమాల్లో టాక్సిక్ ఒకటి. ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ ఉందన్న సంగతి తెలిసిందే. రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ సైతం కథానాయికగా నటిస్తుంది. ఇదివరకు విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్ ఆకట్టుకున్నాయి. రాకింగ్ స్టార్ యష్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న లేటేస్ట్ మూవీ టాక్సిక్. డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఇందులో మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటిస్తుండగా.. అందులో బాలీవుడ్ తార కియారా అద్వానీ ఒకరు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మోన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దాదాపు 500 కోట్ల బడ్జెట్ తో ఈ చిత్రాన్ని పెద్ద ఎత్తున నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో యష్ సరసన ఏకంగా ఐదుగురు హీరోయిన్ రుక్మిణీ వసంత్, కియారా అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషీ, తారా సుతారియలు నటిస్తున్నారు. అయితే ఇందులో కియారా అద్వారీ స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది. కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న కియారా .. ఇప్పుడు టాక్సిక్ సినిమాతో అడియన్స్ ముందుకు రాబోతున్నారు. చాలా కాలంగా ఆమె సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కియారా నదియా అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే విడుదలైన ఫోటోలలో కియారా మరింత అందంగా కనిపిస్తుంది. అయితే ఈ చిత్రానికి ఇప్పుడు కియారా తీసుకునే రెమ్యునరేషన్ గురించి నెట్టింట హాట్ టాపిక్ అయ్యింది. టాక్సిక్ సినిమా కోసం కియారా ఏకంగా రూ.15 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. ఇది ఆమె కెరీర్ లోనే హయ్యేస్ట్ రెమ్యునరేషన్ అని సమాచారం. గేమ్ ఛేంజర్ కోసం దాదాపు 7 కోట్లు వరకు తీసుకుంది. అలాగే వార్ 2 చిత్రానికి రూ.13 కోట్లు తీసుకుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**